# 'విదర్ గోస్ మై కంట్రీ??'

## కంఠంనేని రాధాకృష్ణమూర్తి

ఉదయ చంద్రరావుకు మనస్సంతా చికాగ్గా ఉంది. సామాన్యంగా అతను వెల్తురునీ వెన్నెలనీ అభిమానిస్తాడు, కాని ఆరోజు ఆ సమయాన మట్టుకు అతనిలో వెల్తురు మీద ద్వేషం పుట్టు కొస్తోంది. అప్పటికి చీకటి పడి దాదాపు రెండు గంటలు దాటింది కాని అతను గదిలో లైటు వేసుకోలేదు. కిటికీ తలుపులన్నా తెరవ లేదు. అలా చీకట్లో మంచం మీద పడుకుని మనస్సుతో కుస్తీ పట్టసాగాడు.

"ఏం చెయ్యాలి తనిప్పుడు? తన కర్తవ్య మేమిటి?"

పైన సీలింగ్ ఫ్యాను సన్నగా చప్పుడు చేస్తూ వెచ్చటి గాలిని గదినిండా నింపు తోంది, ఆలోచనలతో అతని మెదడు కూడా వేడెక్కుతోంది.

నిజానికి అతనికి ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు. అతని కోసం అతని తండ్రి బోలెడు ఆస్తిని సంపాదించి పెట్టాడు. గొప్పతనం కోసమూ సమాజంలో కొడుకు హాలిక్స్‌గా కనిపించాలనీ తండ్రి అతణ్ణి ఇష్ట మొచ్చిన చదువు చదువు కొమ్మన్నాడు. ఇంజనీరింగును ఎన్నుకున్నాడు ఉదయ చంద్రరావు, బియ్యీ పూర్తి చేసాడు. పూర్తవంగానే ఉద్యోగం చేస్తానన్నాడు. తండ్రి ఒప్పుకోలేదు, వ్యాపారం చేసు కొమ్మన్నాడు. లేదా ఏదయినా కంట్రాక్టులు తీసుకుని దర్జాగా కాలం వెళ్ళ బుచ్చమన్నాడు, కాని తను చూసిన సినిమాలు, చదివిన పుస్తకాలు కారణంగా వ్యాపారులన్నా కంట్రాక్టరులన్నా సమా జానికి చీడ పురుగులన్న ఒక రకమైన అలస భావం కలిగిఉన్న ఉదయ చంద్ర రావు అందుకు వొప్పుకోలేదు. అభ్యుదయ భావాలు కలిగి ఉన్న అతను కష్టించి బ్రతకాలనుకున్నాడు. తన స్వంత కాళ్ళ మీద తను నిలబడతా నన్నాడు. అలా తండ్రితో విభేదించి ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. త్వరలోనే మంచి ఊపులో పనులు సాగుతున్న ఒక ప్రాజెక్టులో జూనియర్ ఇంజనీరుగా ప్రభుత్వోద్యోగం లభించింది. జాయినయ్యాడు. అక్కణ్ణించి ప్రారంభ మయింది అసలు గొడవంతా....

చటుక్కున ఫ్యాను ఆగిపోయింది. కరెంటు పోయి ఉండాలి, మంచం మీంచి లేచి వెళ్ళి కిటికీ తలుపులు తెరిచాడు ఉదయచంద్రరావు. ఒక్క ఊపున వెన్నెల అతణ్ణి ముంచెత్తుతూ గదిలోకి దూకింది. ఆకాశాన చంద్రుడు కళ్ళు విప్పార్చుకు చూస్తున్నాడు. ఆ వెలుగులో ప్రాజెక్టు ప్రాంతమంతా స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడా లైట్లులేవు. దూరాన నది కవతల కొండలు అక్కడక్కడా కాల్తూ మంటల హారాల్ని మెళ్ళో వేసుకున్నట్లు కనిపిస్తు న్నాయి. గాలిలేదు, అదో చికాకైన విషయం. చొక్కా విడిచి వెనక్కు మంచం మీదకు విసిరేసాడు. అతని వొంటిమీద బనీను లేదు. నడుంనుంచీ పైభాగమంతా

నగ్నంగావుంది.

ఉద్యోగం లభించిన క్రొత్తలో అతను ఎన్నో కలలు కన్నాడు. విద్యుక్త ధర్మానికి కట్టుబడి ఉండాలనీ, అవినీతికి దూరంగా ఉండాలనీ, చుట్టూ ఉన్న మనుష్యుల్ని ఎంతో కొంత సంస్కరించాలనీ ఏవేవో ఊహా హర్మ్యాల్ని సృష్టించుకున్నాడు. కాని త్వరలోనే అతను నిరాశ చెందాల్సి వచ్చింది. తన చుట్టూ ఉన్న వాతావరణం అవినీతితో పూర్తిగా కుళ్ళి కంపు కొడుతున్నది అవటమే కాక అందులో నీతికి ఏమాత్రం స్థానం లేదని గ్రహించటానికి అతనికి ఎక్కువరోజులు పట్టలేదు. ప్రాజెక్టులోని మెజారిటీ ఉద్యోగులు కంట్రాక్టర్లతో కుమ్మక్కు అయ్యే లేక మరో విధంగానో అక్రమ సంపాదన చేయటము, పైగా దాన్ని తమ హక్కుగా భావించటమూ అతనికి విచిత్రంగా కనిపించేది. ప్రాజెక్టు క్రింద ఖర్చు అయ్యే మొత్తంలో నాల్గో వంతుకు పైగా ఇట్లాంటి అక్రమ సంపాదనల క్రింద అంటే ఆఫీసర్ల, ఉద్యోగుల జేబుల్లోకి – పోవటాన్ని గమనించి ఆశ్చర్యపోయాడు. కొన్ని సెక్షన్లుంటాయి. ఇట్లాంటి అక్రమ సంపాదనలకు అమితమైన అవకాశాల్ని కల్పించేవి! పాడి బర్రెల్లాంటి అట్లాంటి సెక్షన్లు దొరకాలని జేయీలూ సూపర్‌వైజర్లూ తహతహలాడుతుండటమూ, ఆ సెక్షనే కావాలని కొన్ని సమయాల్లో రాజకీయ వత్తిడుల్ని కూడా తీసుకు వస్తుండటమూ; ఏ కాస్త నిజాయితీగల ఆఫీసరో అట్లాంటివాళ్ళను ఆ బాపతు సెక్షన్ల నుండి తీసి వేయగానే తన పంచ ప్రాణాలు లాగివేయబడ్డట్లుగా ఆ సూపర్‌వైజరో జేయీనో గిలగిలలాడి పోవటమూ, ఇట్లాంటివన్నీ చూసి విభ్రమంతో తల ముక్కలయి పోయాడు ఉదయచంద్రరావు.

ఈ బాపతు ఉద్యోగుల్లో అంతరాత్మ అనేది ఉండదా ఏమిటని మాటిమాటికీ అతనికి సందేహం కలిగేది. ఇట్లాంటి వాళ్ళంతా తమ పై ఆఫీసర్లు చేసే అక్రమ సంపాదనలతో తమను పోల్చుకుంటూ తాము చాల నయమన్నట్లు ఒక రకపు విచిత్ర ఫిలాసఫీని మాట్లాడటం గమనించాడు. దురదృష్టవశాత్తూ ఆ డిపార్టుమెంటులో అంతకుముందు రిటైరైన ఒకళ్ళిద్దరు ఛీఫ్ ఇంజనీర్లు మరీ అవినీతి కోరులుగా పేరుబడి ఉండటం వీళ్ళ వాదానికి మరింత ప్రోత్సాహాన్ని, బలాన్ని కలిగించుతోంది. ఇలాంటి అక్రమ సంపాదనలను ఎవరూ నేరం క్రింద తీసుకోక పోవటమూ, పైగా సమాజంలో అదో ప్రిస్టేజీ క్రింద భావించబడటమూ, ఒకవేళ రుజువై వీళ్ళు పట్టుబడినా గాని చట్టంలో అందుకు తగ్గ సరైన పనిష్‌మెంట్ నిర్దేశించబడక పోవటమూ ఈ విచ్చలవిడి తనానికి దారి తీస్తోందనిపించింది ఉదయచంద్రరావుకు.

క్రొత్తగా అప్పుడే కాలేజీనుంచి బయటికొచ్చిన యువకులు కూడా అసలు జీతం కంటే ఈ పైసంపాదన కోసం ఎక్కువగా పెరపెరలాడుతుండటం ఉదయచంద్రరావుకు మరీ విచిత్రమనిపించేది. అదేమిటి, వాళ్ళలో ఉడుకు రక్తం లేదా? యవ్వన సహజమైన ఆదర్శాలు నిజాయితీ మొదలైనవి మచ్చుకైనా లేకుండా అంతటి నిర్వీర్యంగా తయారవుతోందా నేటి తరం? అతని ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలి పోయాయి.

అంతలో గభాల్న లైట్లు వెలిగాయి. కళ్ళు చిట్లించాడు ఉదయ చంద్రరావు. చికాగ్గా వెనక్కు తిరిగి గోడవద్దకు వెళ్ళి లైటు తీసివేసి తిరిగి కిటికీ వద్దకు వచ్చి నిలబడ్డాడు. కాంపునిండా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి...

ఉద్యోగంలో చేరినప్పటినుంచీ తన ఆదర్శాలు కారణంగా అతను అశాంతి పాలవుతూ వచ్చాడు. అనేక సమయాల్లో అతను అవినీతిని అంగీకరించక పోవటం అతని పై ఆఫీసర్లకు "చెప్పలోనిరాయి" క్రింద పరిణమించటంతో వాళ్ళ కన్నెర్రకు



గుర్త్రై ఈ డివిజనునుంచి ఆ డివిజనుకు, అక్కడి నుంచి మరో చోటికి, ఇలా ట్రాన్స్ఫర్లు చేయబడ్డాడు. కొన్ని సమయాల్లో ఇతను మాకక్కర లేదంటూ కొందరు ఆఫీసర్ల చేత సరెండర్ చేయబడ్డాడు. అతని కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు ఖరాబయ్యాయి. మొత్తానికి ప్రాజెక్టులో అతనో వింత జీవి క్రిందా, ఓ తలతిక్క మనిషిగానూ పరిగణించ బడుతున్నాడు.

"ఇదా నిజాయితీకి ప్రతి ఫలం?!" బాధగా గొణుగుకున్నాడు ఉదయచంద్ర రావు.

ప్రస్తుతం రెండు రోజులనుంచీ అతను లీవుమీద ఉంటూ డ్యూటీకి వెళ్ళటంలేదు. దానికి కారణం మూడు రోజుల క్రితం జరిగిన ఒక సంఘటన.

నాలుగు నెలల నుంచి అతను ప్రాజెక్టుకి అవసరమయే విద్యుత్పరికరాలు, మెషీన్లు, వాహనాల విడిభాగాలు మొదలైన వాటిని ఖరీదు చేసి స్టోర్ చేసి ఉంచే ఒక డివిజనాఫీసులో పనిచేస్తున్నాడు. ఆ డివిజనుకి అధికారైన ఇ. ఇ. దురహంకారే కాక దురాశా పూరితుడు కూడా. ఎంతసేపూ తన జేబు నెలా నింపుకోవాలా అని చూస్తుంటాడు. ఏవైనా పరికరాలు కొనాలంటే ఆ ఆఫీసు నుంచి ముందు ఎంక్వయిరీలు పంపుతారు కొన్ని కంపెనీలకు. ఆ కంపెనీల వాళ్లు తమ రేట్లను ఉదహరిస్తూ పంపేక కొటేషన్లను కంపారెటివ్ స్టేట్మెంట్ ద్వారా పోల్చి చూసుకుని తక్కువ రేట్లకు కోట్ చేసిన కంపెనీలకు మాత్రం ఆర్డర్లు వేసి ఖరీదు చేయాల్సి ఉంటుంది. కనీసం మూడు కంపెనీల రేట్లనన్నా ఇలా కంపేర్ చేయాల్సి ఉంటుంది రూలు ప్రకారం. (కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప!) అయితే అవినీతిని ఆశ్రయించ దల్చుకున్న వాళ్ళకు అన్వేషిస్తే వక్రమార్గాలు లభించక పోవు. ఒక కంపెనీ వాడు తన కంపెనీ పేర ఇష్టమొచ్చిన రేట్లను కోట్ చేస్తూ మరో మూడు నాలుగు బోగస్ కంపెనీల పేర్ల క్రింద తన రేట్ల కంటే హెచ్చు రేట్లను కోట్ చేసి సబ్మిట్ చేస్తూ ఆర్డర్లను సంపాదించుకోవటం ఒక రకం. అయితే ఈ బోగస్ కంపెనీల పేర్లు ఇ ఇ పంపిన ఎంక్వయిరీ లిస్టులో ఉండాలి. అంటే ఇలాంటి దుశ్చర్యలకు కంపెనీ వాడితో ఇ. ఇ. చేతులు కలపాల్సి ఉంటుందన్న మాట! ఉదయ చంద్రరావు వాళ్ళ ఇ ఇ ఈ బాపతుకు సంబంధించిన ఆఫీసరు. ఎంక్వయిరీ పంపేటప్పుడే తనకిష్టమైన కంపెనీ కాక ఈ రకపు బోగస్ కంపెనీల పేర్లకు మాత్రం ఎంక్వయిరీ పంపబడేటట్టు చూసే వాడు. ఇలా అతను తనకిష్టమైన కంపెనీల నుండి బజారు రేట్లకంటే అతి దారుణమైన హెచ్చు రేట్లకు వస్తువుల్ని ఖరీదు చేస్తూ జేబులు నింపుకుంటుండే వాడు. ఇటాల చేయటం వల్ల ఆడిట్ వాళ్ళకు పట్టుబడటమంటూ జరగదు. కొద్ది రోజుల్లోనే ఈ రహస్యాన్ని గమనించిన ఉదయ చంద్రరావు తర్వాత తయారు చేసిన ఒక ఎంక్వయిరీలో అసలు సిసలైన మరో నాలుగు మంచి కంపెనీల పేర్లను కూడా ఇంక్లూడ్ చేసి సంతకానికి ఇఇ వద్దకు పంపించాడు. అది చూస్తూనే మండిపోతూ ఇఇ అతని కోసం కబురు పెట్టాడు, వెళ్లాడు ఉదయ చంద్రరావు.

"ఈ కంపెనీల పేర్లను ఇంక్లూడ్ చేయమని నీకెవరు చెప్పారు మిస్టర్?"

"నేనే ఇంక్లూడ్ చేసాను."

"అదే, ఎందుకు చేసావంటున్నాను."

"మన ఆఫీసు ఫరమ్స్ రిజిస్టర్‌లో ఈ కంపెనీలు కూడా రిజిస్టరయి ఉన్నాయి సార్."

అయితే నన్ను అడగాల్సిన పని లేదా?"

"పోటీ ఎంత ఎక్కువ అయితే వస్తువు అంత తక్కువ ధరకు లభిస్తుందని వాటిని ఇంక్లూడ్ చేసాను. తక్కువ ధరకు మెటీరియల్‌ని కొనటంవల్ల డిపార్ట్మెంటుకి లాభమే కదండీ."

"నో ఆర్గ్యుమెంట్స్ ప్లీజ్! ఈ కొత్త కంపెనీల పేర్లను తీసివేసి ఎప్పటిలాగే పాత కంపెనీలను మాత్రమే ఉంచుతూ ఫ్రెష్ ఎంక్వయిరీ తయారుచేసి పట్రా" అన్నాడు ఇఇ సీరియస్‌గా.

ఉదయచంద్రరావు అందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా మరి కొద్ది రోజుల్లోనే అతనికి మరో డివిజనుకు ట్రాన్స్ఫరు చేయబడుతూ ఆర్డర్లు అందాయి విచిత్రమనిపించిందతనికి.

"లైసెన్స్‌డ్ కరప్షన్!" కసిగా గొణిగాడు.

ఉద్యోగ జీవితంలో మొదటిసారిగా నిరాశను ఫీలయ్యాడు ఉదయచంద్రరావు. రెండు రోజులనుంచి సెలవు పెట్టి ఇంటివద్ద ఉంటూ ఈవిషయంమీదే ఆలోచిస్తున్నాడు. ఒక్క ఈ సంఘటనే కాదు, అతను మునుపు ఇట్లాంటివి మరెన్నో జరిగాయి. ఇట్లా

ఎంత కాలమని?? ఫుట్ బాల్ లా తన్ను బడుతూ, అశాంతికి లోనవుతూ, తోటి ఉద్యోగులచేత విచిత్రంగా చూడబడ తూ నిజంగానే తను మూర్ఖుడా? స్వార్థం గురించికాక విద్యుక్త ధర్మం గురించి తాపత్రయ పడటం అవివేకమా?? ఏమో సమాజం నుండి తనకు నైతిక సహాయం లభించటంలేదు — ప్రస్తుతం తన కర్తవ్య మేమిటి? ఇలా ఉద్యోగకాలజీవితాన్నంతా అవకతవకగా మలుచుకోవటమా లేక అందరిలా తనూ....

"ఉదయా!"

చప్పున పులకరించింది ఉదయ చంద్ర రావు హృదయం-అస్వరం కమలది.

యూడీసీ రామనాథం కూతురామె. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించు కున్నారు.

"రా కమలా," అన్నాడు.

"చీకట్లో ఏం చేస్తున్నావు ఉదయా?"

ఆమె మెల్లగా నడుచుకుంటూ వచ్చి అతని వెనక నిలబడింది. రెండు చేతుల్ని అతని పొట్టచుట్టూ బిగించి తన కుడిచెంపతో నగ్నంగా ఉన్న అతని వీపుమీద కొద్దిసేపు అటూ ఇటూ పామింది.

"ఏమిటి. ఆలోచిస్తున్నావు?" అన్నది.

చెప్పాడు ఉదయ చంద్రరావు.

"నిజానికి నాకీ ఉద్యోగం చేయాలని లేదు కమలా. నాకు నేను స్వతంత్రంగా బ్రతుకు దామనీ, మనుషుల్లో ఆదర్శంగా నిలబడదామనీ, దేశ నిర్మాణ కృషిలో ఏదో ఉడతా భక్తిగా పాలు పంచుకుందా మనీ ఇలా ఏవేవో ఆశలతో ఉద్యోగంలో చేరాను. కాని - కాని .... రోజు రోజుకూ నాకు అర్థమవుతోంది, ఇక్కడ నిజాయితీకి స్థానం లేదు. సెన్సాఫ్ డ్యూటీని ఓ వెర్రి వాడి మనస్తత్వం క్రిందా, మంచితనాన్ని చేతగాని తనం క్రిందా లెక్కగడుతు న్నారీ మనుష్యులు. వీళ్ళంతా డబ్బుకాపీ నం గాళ్ళు. డబ్బుకోసమో, ప్రమోషను కోసమో ఎంత అసహ్యమైన పని చేయటాని కైనా వెనుకాడరు వీళ్ళు. కూటికి గతిలేని వాళ్ళు అట్లాంటివి చేసినా ఏ కొంతో సమ ర్థనీయంగా ఉంటుంది గాని వీళ్ళు, వీళ్ళు... కమలా ఇన్నాళ్ళూ లేనిది ఇవాళ నాకీ ఉద్యోగం మీద విరక్తి పుడుతోంది. ఎక్కడ లేని నిస్పృహ ఆవరిస్తోంది నా మనస్సుని. ఏం చెయా లి నేనిప్పుడు? ఇలా గే అధర్మా నికి ఎదురు తిరుగుతూ జీవితంలో ఇబ్బం దుల్ని వెంట తెచ్చుకుంటూ బ్రతకనా లేక నేను కూడా ఈ మందలో ఒకడిగా కలిసి పోనా?? చెప్పు కమలా నువ్వైనా చెప్పు, ఎట్లా బ్రతకమంటావు నన్ను?"

"నిజంగా నీకు నా సలహా కావాలం టావా ఉదయా?"

"అవును కమలా, చెప్పు. కాబోయే సహధర్మచారిణివి, నీ సలహా కాక మరెవరి సలహా కావాలి నాకు?"


"నువ్వూ అందరిలాగే ఉండు ఉదయా రెండు చేతులా సంపాదించు."

ఉలిక్కి పడ్డాడు ఉదయచంద్రరావు. చటుక్కున వెనక్కి తిరిగి, రెండు చేతులూ కమల భుజాలమీద వేసి ఆమెను కుదుపుతూ ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసాడు.

"డార్లింగ్, ఏమిటి నువ్వనేది? అసలు నువ్వేనా ఈ మాటలంటున్నది ?!" కొద్ది క్షణాలు ఊరుకుని మళ్ళీ అన్నాడు బాధగా.

"అందమైన ఆడవాళ్ళ హృదయాలు ఎంత వికృతంగా వుంటాయి కమలా !! అవును ... డబ్బు! డబ్బు!!" కసిగా గొణి గాడు.

"నన్ను అపార్థం చేసుకోకు ఉదయా," అతనికి దగ్గరగా జరుగుతూ అన్నదామె. "అందరి ఆడవాళ్ళలా నాకూ నా భర్త బాగా సంపాదించాలనీ, నన్ను లగ్జరీస్‌లో ముంచెత్తాలనీ, నేను కోరుకున్న బట్టలు గానీ నగలు గానీ లేదనకుండా కొనగలిగే స్తోమతు అతనికి ఉండాలనీ, సాటి ఆడ వాళ్ళు నా ఐశ్వర్యాన్ని అదృష్టాన్ని చూసి ఈర్ష్య చెందాలనీ, ఇలాంటి కోర్కె లుండటం అసహజం కాదనుకుంటాను."




"వానిటీ!" వ్యంగ్యంగా అన్నాడు ఉదయ చంద్రరావు.

"అవును ఉదయ్, స్వేచ్ఛను అణచుకోవాల్సి వచ్చేసరికి ఆడది వానిటీని ఆశ్రయించాల్సి వస్తోంది. ఉదాత్తంగా..."

కమల వెళ్ళిపోయాక ఉదయ చంద్రరావు నిద్రపోవటానికి ప్రయత్నించాడు. అనుకోకుండా అతనికి కళ్ళ ముందు తన డాక్టరు మిత్రుడు కదలాడాడు. అతని పేరు రఘు. అతను యంబీబీయస్ పాసయి ప్రైవేటుగా ప్రాక్టీసు పెట్టాడు ప్రాజెక్టులో. తరచుగా ఉదయ చంద్రరావు ఏమీ తోచనప్పుడు అతని వద్దకు వెళ్ళి కాలక్షేపం చేసి వస్తుంటాడు. ఒక రోజు అతను వెళ్ళేసరికి రఘు ముందున్న కుర్చీలో ఒక యువతి కూర్చుని ఉంది. ఆమెను చూడగానే బజారు స్త్రీ అని తెలుస్తోంది. ఉదయ చంద్రరావు వెళ్ళగానే అప్పటి వరకు నవ్వుతూ కబుర్లు చెబుతున్న ఆమె చప్పున లేచి నిలబడింది.

"వెళ్ళొస్తాను డాక్టరుగారూ"

"మంచిది, డబ్బులేమైనా కావాలా?" అన్నాడు రఘు,

"ఒక ఇరవై ఉంటే ఇవ్వండి."

జేబులోంచి రెండు నోట్లు తీసి ఆమెకిచ్చాడు రఘు.

"ఆశ్చర్యంగా ఉంది," ఆమె వెళ్ళిపోయాక అన్నాడు ఉదయచంద్రరావు.

"ఇంత వరకూ నేను ఒక పేషంటు డాక్టరుకు డబ్బులివ్వటాన్ని చూసాను. గాని, డాక్టరే పేషెంటుకు డబ్బులివ్వటాన్ని మాత్రం ఇదే చూడటం—"

"నువ్వు పొరబడుతున్నావు ఉదయ చంద్రరావ్, ఆమె నా పేషెంటు కాదు."

"మరి?"

"నా ఏజంటు," నవ్వాడు రఘు.

అర్థం కానట్లు చూసాడు ఉదయ చంద్రరావు

"సూటిగా చెప్ప మంటావా?" రఘు అన్నాడు. "అయితే విను- ఈ ప్రాజెక్టుకు వచ్చిన కొత్తలో అందరిలాగా నేను కూడా మామూలు రోగాల్ని కుదర్చటానికి ప్రయత్నించాను. నా హస్తవాసి బాగోకో ఏమో గాని అందులో అంతగా రాణించలేక పోయాను. ఈలోపు మరో ఇద్దరు యంబీలు నాకు పోటీకి వచ్చారు. ఉన్న గవర్నమెంట్ హాస్పటల్ కాక ఇల్లాంటి పరిస్థితుల్లో డాక్టరుగా ఎట్లా నిలదొక్కుకోవాలంటావు?" చటుక్కున పెద్దగా నవ్వాడు రఘు. అంతలోనే మళ్ళీ అన్నాడు, "ఆఖరుకు ఆలోచించి ఆలోచించి ఈ లైనులోకి మారాను...."

"ఏ లైను?"

"బుద్ధావతారానివి—నీకు తెలియకపోవచ్చు, చివరికి నేనిక్కడ సుఖరోగాల

స్పెషలిస్టుగా స్థిరపడ్డాను. స్థిరపడ్డాను అనటంకంటే ప్రసిద్ధి చెందానంటే బాగుంటుంది... ఇంతకుముందు వెళ్ళిన దాని లాంటివాళ్ళు మరో నలుగు రయిదుగురు ఉన్నారు. వీళ్ళంతా నా ఏజెంట్లు ఇలాంటి ప్రదేశాల్లో వ్యభిచారం సహజమూ, తప్పని సరీ కూడాను. ఈ ఆడవాళ్ళు తమ రోగాల్ని విటులకు అంటించుతుంటారు. తప్పనిసరిగా వాళ్ళు ట్రీట్ మెంటుకు నా వద్దకే వస్తుంటారు. కాక వీళ్ళు నా పేరును సజెస్ట్ చేస్తుంటారు కూడా అవసరాన్ని బట్టి. ఇప్పుడు అర్థమయిందనుకుంటాను నీకు, వీళ్ళు నా ఏజెంట్లు ఎట్లా అయ్యారో. అటు వాళ్ళ వ్యాపారమూ, ఇటు నా వృత్తీ, ఇలా దినదిన ప్రవర్ధమానమవుతుంటాయి. అడపా దడపా నేను నా ఏజెంట్లకు కమీషన్ క్రింద ఎంతో కొంత ముట్ట జెప్పుతుంటాను."

"హారిబుల్!!"

అది గుర్తుకొచ్చి జుగుప్సతో జలదరించింది ఉదయచంద్రరావు హృదయం. ఎక్కడ చూసినా స్వార్థం, అధర్మం, అవినీతి!! ఇట్లాంటి మందమధ్య తనలాంటి వాళ్ళు ఎన్నాళ్ళని నెగ్గుకురాగలరు? కమల, రఘు, ఇతులు, పతులు, కంట్రాక్టర్లు, సాటి జేతలు, అంతా అతని కళ్ళముందు గిరగిరా తిరగసాగారు. వాళ్ళంతా అతన్ని వెక్కిరిస్తున్నారు. గేలి చేస్తున్నారు. దయ్యం లాంటి అవినీతి హస్తం గుప్పిట తెరచి అతణ్ణి ఆహ్వానిస్తోంది....

మర్నాడు ఉదయానికి అతని మనస్సు కాస్త తేలిక పడింది. ఆఖరికి అతనో నిర్ణయానికి రాగలిగాడు....

ఆ సాయంత్రం అతను బజారులో నడుస్తుంటే కంట్రాక్టరు రెడ్డి కనిపించాడు జీపులో ఎటో పోతూ. వెనక సీట్లో అతని వద్ద పనిచేసే జోసెఫ్ అనే ఓ మేస్త్రీ కూర్చుని ఉన్నాడు.

"ఉదయ చంద్రరావుగారూ మేము నర్సీపట్నం పోతున్నాము వస్తారా?" అన్నాడు రెడ్డి స్టీరింగు ముందునుంచి.

కొద్దిసేపు ఆలోచించాడు ఉదయచంద్రరావు.

"పదండి నేనూ వస్తాను. నాకు కాస్త ఛేంజ్ కావాలనిపిస్తోంది" అన్నాడు.

ఆశ్చర్యపోయాడు రెడ్డి. అతనేదో మాటవరసకు అన్నాడు కాస్త వ్యంగ్యంగా కూడ అన్నాడేమో. ఎందుకంటే ఉదయ చంద్రరావు సామాన్యంగా కంట్రాక్టర్లతో అంత కలుపుగోలుగా ఉండడు. వాళ్ళ సహాయాల్ని ఎంత చిన్నవైనాగాని స్వీకరించడు. కూడా అదీకాక అంతకు ముందు ఒకసారి పవర్ హౌస్ రూఫ్ కాంక్రీటింగ్ చేయించుతున్నప్పుడు అక్కడ కంట్రాక్టరుగా రెడ్డిచేసే అక్రమాలకి ఉదయచంద్రరావు సహకరించకపోగా అతనితో వివాద పడ్డాడు. అట్లాంటి ఉదయచంద్రరావు ఇవాళ తన ప్రపోజల్ కి వెంటనే వొప్పేసుకోవటం వింత గొల్పింది రెడ్డికి. అతని కళ్ళలో విజయగర్వం లాంటిది ఒక్క క్షణం కదిలి మాయమయిపోయింది.

ముందు సీట్లో రెడ్డి పక్కన ఉదయ చంద్రరావు. ఆ పూట అతను రెడ్డితో చాలా కలుపుగోలుగా మాట్లాడాడు. చెక్ పోస్టు దాటి కొంత దూరం పోయాక సడన్ గా టాపిక్ మార్చేస్తూ రెడ్డితో అలా అన్నాడు.

"రెడ్డిగారూ, ఆఖరుకి నేనో నిర్ణయానికి వచ్చాను."

"ఏ విషయంలో?"


"ఏమిటండోయ్ ఆ నిర్ణయం?"

"చెబుతాను. అది చెప్పబోయే ముందు మీకో ఉపమానం చెప్పాలనిపిస్తోంది. వినటానికి మీకేమీ అభ్యంతరం లేదుగా?"

"నో నో, చెప్పండి!"

"ఈ ప్రాజెక్టుల క్రింద ఖర్చయ్యే ఈ సొమ్మంతా ఎవరిదంటారు? ప్రభుత్వానిది. అంటే ఒకరకంగా ప్రజల ఖజానా అన్న మాట..."

"కరెక్ట్. అయితే"




"ఈ ప్రభుత్వోద్యోగులు ఉన్నారు చూసారు, నన్ను కూడా కలుపుకుని - వీళ్ళంతా ఆ ఖజానాని కాపాడటానికి వినియోగించబడ్డ శునకాలు-ఐమీన్ కుక్కలు"

"సెభాష్ ఈ ఉపమానం చాలాబాగుంది, నెక్స్ట్?"

"ఇకపోతే మీ కంట్రాక్టర్లు ఉన్నారు చూసారూ, వాళ్ళు దొంగలు ఈ ఖజానాని ఏదో రకంగా అక్రమంగా దోచుకోవటానికి ప్రయత్నిస్తూ అప్రమత్తంగా ఉన్న ఈ కుక్కలకు ఏ బిస్కత్తువో, మాంసం ముక్కవో ఎరగా వేసి లోబరుచుకుంటూ తమపని కానిచ్చేసుకుపోతుంటారు. అవునంటారా?"

"అఫ్ కోర్స్, ఎక్కడో మీ బోటి జాతి శునకాల విషయంలో తప్ప!"

"అవును. అయితే తొంభయి తొమ్మిది ఊరకుక్కల మధ్య ఒక జాతి శునకం తన ధర్మాన్ని నిర్వర్తించటం కష్టమని తెలుసుకున్నాను అనుభవం మీద. అందుకే ఆఖరుకి ఒక నిర్ణయానికి వచ్చాను."

రెడ్డి కళ్ళు తళుక్కున మెరిసాయి.

"ఏమిటది, ఊరకుక్కల్తో కలిసి పోదల్చుకున్నారా." అన్నాడు

"లేదు లేదు. నేను చాలా అసహ్యించుకుంటాను దాన్ని ..." కొద్దిసేపు ఊరుకుని చిన్నగా అన్నాడు ఉదయచంద్రరావు. "ఈ ఉద్యోగానికి రిజైన్ చేయదల్చుకున్నాను,"

"బస్, అంతేనా?! ఓటమిని ఒప్పుకోవటమన్న మాట! మరి తర్వాత ఏం చేద్దామని?"

కన్నింగ్‌గా నవ్వి, ఇలా అన్నాడు ఉదయచంద్రరావు

"దొంగను కాదల్చుకున్నాను!"

"వ్వాట్!?" నోరు తెరిచాడు రెడ్డి.

అంత వరకూ వాళ్ళ సంభాషణ వింటున్న వెనక సీట్లోని జోసెఫ్ చటుక్కున తన రెండు భుజాల మీదా, హృదయం మీద క్రాస్ చేసుకుంటూ చిన్నిగా గొణిగాడు

"మే గాడ్ సేవ్ దిస్ నేషన్!" ❋